మందేసి.. రయ్‌రయ్..!

- పోలీసులకు చిక్కిన ట్యాంకర్ డ్రైవర్

ఖైరతాబాద్, మార్చి 24 : పూటుగా మందేసి ట్యాంకర్‌తో రోడ్డెక్కాడో వ్యక్తి. జిగ్‌జాగ్ డ్రైవింగ్ చేస్తుండటాన్ని గమనించిన ట్రాఫిక్ పోలీసులు అతడికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా, బీఏసీ పాయింట్స్ చూసి అవక్కాయ్యారు. పంజాగుట్ట ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన యాదగిరి శ్రీవెంకటేశ్వర వాటర్ సప్లయర్స్‌కు చెందిన డీసీఎం(వాటర్ ట్యాంకర్) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రామాంతపూర్‌లో ట్యాంకర్‌ను నింపుకొని పంజాగుట్ట మీదుగా అమీర్‌పేట్ వైపునకు వెళ్తున్నాడు. అతని డ్రైవింగ్‌లో తేడా కొట్టడంతో పోలీసులు వాహనాన్ని ఆపి బ్రీత్ అలైజింగ్ పరీక్ష నిర్వహించగా, 325 బీఏసీ పాయింట్లు చూపించింది. వెంటనే ట్యాంకర్‌ను సీజ్ చేసి సదరు మందుబాబుపై కేసు నమోదు చేశారు.

రాజేంద్రనగర్ ఆర్టీసీ డీఎం బాధ్యతల స్వీకరణ

బండ్లగూడ, మార్చి 24 : రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వేణుగోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ పని చేసిన బద్రీనారాయణ ఎంజీబీఎస్ కార్గోకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన డీఎం మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు కృషి చేస్తానన్నారు. సకాలంలో బస్సులు నడిచేలా చూస్తానన్నారు. ఆర్టీసీ అధికారులు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడలో జోరుగా అక్రమ నిర్మాణాలు

- అడ్డుకోవాలని ప్రజావాణిలో పలువురు ఫిర్యాదు

జూబ్లీహిల్స్,మార్చి 24: యూసుఫ్‌గూడ సర్కిల్‌లో అనుమతిలేకుండా నిర్మిస్తున్న భవనాలు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను ఆదిలోనే అడ్డుకోవాల్సిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణ ప్రణాళికా విభాగానికి చెందిన అధికారులు అమ్యామ్యాయాలతో కార్యాలయాల నుంచి కదలకపోవడంతో అక్రమ నిర్మాణాలు 'ఇంతిత్తై..' అన్న చందంగా ఆకాశానికి ఎగబాకుతున్నాయి. ఫలితంగా జీహెచ్ఎంసీ ఆదాయానికి భారీగా గండి పడుతున్నది. దాంతోపాటు అడిగే వారు లేక అక్రమార్కులు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా సోమవారం ప్రజావాణిలో అందిన ఫిర్యాదును పేర్కొనవచ్చు. యూసుఫ్‌గూడ కృష్ణానగర్ లోని జైన్ ప్రార్థనా మందిరం సమీపంలో అనుమతులు లేకుండా ఏడంతస్తుల భవనం నిర్మించారని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యా దు చేశారు. స్థానికంగా అవుతు సంజీవరెడ్డి, సాంబిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు చట్ట విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌లో అనుమతి లేకుండా నిర్మించిన భవనం

క్షయను నిర్మూలిద్దాం..

కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

ఖైరతాబాద్, మార్చి 24 : ప్రాణాంతక క్షయను శాశ్వతంగా రూపుమాపుతామంటూ వైద్యులు స్పష్టం చేశారు. అంతర్జాతీయ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం నిమ్స్ దవాఖానలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్స్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుబ్బలక్ష్మి, ప్రొఫెసర్ నావల్ చంద్ర మాట్లాడుతూ.. గత దశాబ్దం కాలంలో క్షయ వ్యాధి గణనీయంగా తగ్గిందని, రానున్న రోజుల్లో పూర్తిగా నివారిస్తామన్నారు. ప్రజలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిమ్స్‌లోని వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు పాల్గొన్నారు.

సులేమాన్‌నగర్‌లో ఇఫ్తార్ విందు

ఇఫ్తార్‌విందులో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పీ. కార్తిక్‌రెడ్డి, ముస్లింలు

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 24 : పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఆనందంగా ఉండాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పీ. కార్తిక్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని సులేమాన్ నగర్ డివిజన్‌లో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థోమతను బట్టి తోటి వారికి సహాయం చేయాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంవల్ల ప్రతి ఇంట్లో ఆనందం కనిపించేదని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కనిపించడంలేదన్నారు. బీఆర్ఎస్ సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు మొహమ్మద్ జహీరుద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ ఇఫ్తార్‌విందులో నాయకులు జయప్రకాశ్, రాములుయాదవ్, రఘుయాదవ్, అబ్దుల్ రహమాన్, మహమ్మద్, ముఖేశ్, దేవదాసు, మార్బుల్, అశోక్, పటేల్, వర్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ్ల
- అంజలి గార్డెన్ కాలనీలో 'గుడ్ మార్నింగ్ మణికొండ'

మణికొండ, మార్చి 24 : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే బీఆర్ఎస్ పనిచేస్తున్నదని బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ్ల అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి కాలనీలో 'గుడ్ మా ర్నింగ్ మణికొండ' పేరుతో ప్రజా సమ స్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సోమవారం అంజలి గార్డెన్ కాలనీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాలనీవాసుల ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అనేక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా త్రాగునీరు, రహదారుల అస్తవ్యస్తం, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరాలో అంతరాయం వంటి సమస్యలను ప్రస్తావించారు. ల్యాంకో హిల్స్ నుంచి ఎగుడు దిగుడు రహదారులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొన్ని చోట్ల రోడ్డు మధ్యలో డ్రైనేజీ పైప్‌లైన్ దెబ్బతిని ఎప్పుడు ఏ ప్రమా దం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యతోపాటు ఈఐపీఎల్ నిర్మాణ రంగ సంస్థ జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన రెడిమిక్స్ ప్లాంట్‌తో వాయు కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. అంతేకాకుండా వీధి కుక్కల బెడద ఉందన్నారు. ఆయా సమస్యలపై త్వరలోనే అధికారులను కలుస్తామని బీఆర్ ఎస్ నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుంభగల్ల ధనరాజ్, నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, కిరణ్, సుమనళిని, శ్రీధర్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంజలి గార్డెన్ కాలనీలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

జలమండలి జీఎం మహేందర్‌నాయక్‌కు సన్మానం

బండ్లగూడ, మార్చి 24 : హైదర్ షాకోట్ గ్రామంలో తాగునీటి సమస్యను మెరుగుపరచడంపై జలమండలి జనరల్ మేనేజర్ మహేందర్‌నాయక్ కు మాజీ కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలో ఎమ్మెస్సీ(ఐఎస్) రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 26 నుంచి, మాస్టర్స్ డిగ్రీ ఇన్ పోలీస్ మేనేజ్మెంట్ వన్ టైం చాన్స్ పరీక్షలను వచ్చే నెల 5 నుంచి నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **Pathi Keerthi Kumar** is the owner of H.No. 7-1 (PTI No. 201262501480), Land admeasuring 494 Sq.yds., situated at Narsingi Village, Gandipet Mandal, Ranga Reddy District who acquired the same vide Registered Sale Deed No. 3182/2021, Dated 17-02-2021.

Whoever has got any claims or rights over the above mentioned property, please Contact J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.

డ్రైనేజీ క్లీనింగ్‌లో ఆధునిక పరికరాలు ఉపయోగించాలి

పారిశుద్ధ్య సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ, మార్చి 24. డ్రైనేజీలను శుభ్రం చేయడంలో ఆధునిక పరికరాలను ఉపయోగించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర పేర్కొన్నారు. సోమవారం కమిషనర్ కార్యాలయంలో నేషనల్ సఫైకరంచారిస్ ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారు నిర్వహిస్తున్న నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైస్డ్ శానిటేషన్ ఇకో-సిస్టమ్‌పై మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ జెన్ రోబోటిక్స్ వారితో కలిసి పీపీఈ కిట్స్ ఉపయోగం, ఆయుష్మాన్ భారత్ కార్డ్ ఈ కేవైసీపై పారిశుధ్య సిబ్బందికి వివరించారు. డ్రైనేజీలను శుభ్రం చేసే సమయంలో అనేక సమయాల్లో పారిశుద్ధ కార్మికులు ప్రమాదాల బారిన పడి చనిపోతున్నందున రోబోటిక్ వంటి ఆధునిక పరికరాలను ఉపయోగించాలన్నారు. ఇందుకోసం నేషనల్ కరంచారీస్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ వారి సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు కేటాయించండి

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీలు ఈటల, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నగేశ్

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 24: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, ప్రధానంగా ఏడవ వేతన సవరణ సంఘం ఏరియర్స్‌ను విడుదల చేయాలని సోమవారం వర్సిటీ ఉద్యోగులు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌ను కోరారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నాయకత్వంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్‌ను కలిశారు. వ్యవసాయ యూనివర్సిటీలో బోధన సిబ్బంది ఏడవ వేతన సవరణ సంఘం ఏరియర్స్ విషయంలో సహకరించాలని వారికి కేంద్రం నుంచి రావలసిన రూ. 17.5 కోట్ల సెంట్రల్ గ్రాండ్ రిలీజ్ చేయాలని కోరారు.

ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం (టాస్) కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నగేశ్ ఆర్థిక శాఖ మంత్రితో భేటీ అయ్యారు. కార్యక్రమంలో టాస్ నాయకులు ప్రొఫెసర్ బి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో ఆసుపత్రిని నడుపుతున్న నిర్వాహకురాలి రిమాండ్

మణికొండ, మార్చి 24 : తప్పుడు పత్రాలతో ఇంటి యజమానిని మోసగించి దవాఖాన నడుపుతున్న నిర్వాహకురాలపై నార్సింగి పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... నార్సింగి-మంచిరేవుల చౌరస్తా సమీపంలోని ఆరోన్ ఆసుపత్రి భవన యజమాని సన ఫాతిమా అగ్రిమెంట్ పత్రాలను ఫోర్జరీ చేసి బలవంతంగా భవనంలో తిష్ట వేసి కొన్నాళ్లుగా ఆసుపత్రి నడుపుతున్న డాక్టర్ అలీ యామ్మ సెబాస్టియన్‌పై భవన యజమాని ఫిర్యాదు చేశారు. జిల్లా వైద్యాధికారికి సైతం ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపిన అధికారులు ఫోర్జరీ సంతకాలతో చేసిన అగ్రిమెంట్‌తో 2001 నుంచి ఆసుపత్రిని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు నార్సింగి పోలీసులు ఆసుపత్రి నిర్వహకురాలిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణరెడ్డి తెలిపారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

వెంగళరావునగర్, మార్చి 24 : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని రాజీవ్‌నగర్‌లోని జాస్మిన్ హైస్కూల్ చైర్మన్ పి.జగన్నాథం అన్నారు. జాస్మిన్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన మినీ కాన్వొకేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుపట్ల ఆసక్తి కలిగేలా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. ఆకట్టుకునే వస్త్రధారణతో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ యు. విజయలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్యాగ బాలరాజుకు ఉగాది పురస్కారం

అమీర్‌పేట, మార్చి 24 : సహజ కవి, గీతారత్న డ్యాగ బాలరాజుయాదవ్‌కు తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ (పాలమూరు), ప్రమీల శక్తిపీఠం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో విశ్వవసు నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని అందజేసి సత్కరించారు.

అమీర్‌పేట.. కేఫ్‌లో గ్యాస్ లీకై భారీ పేలుడు

- ఆరుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

క్రీసెంట్ కేఫ్ అండ్ బేకర్స్‌లో పేలుడు ధాటికి చెల్లచెదురుగా పడిపోయిన సామగ్రి

వెంగళరావునగర్,మార్చి 24: అమీర్‌పేట సత్యం థియేటర్ చౌరస్తాలోని క్రిసెంట్ కేఫ్ అండ్ బేకర్స్‌లో గ్యాస్ లీకై పెద్ద ఎత్తున పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి షాపు గోడలు బద్దలై షెట్టర్ గాలిలో ఎగిరి ప్రధాన రహదారి పుట్‌పాత్‌పై పడింది. ఇటుకలు పక్కనే ఉన్న హోటల్ లోపలికి దూసుకొచ్చి కాగుతున్న కడాయిలో పడ్డాయి. ఈ ప్రమాదంలో ఆరుగురికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నది. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సత్యం థియేటర్ చౌరస్తాలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదుట ఉన్న దాడి జీవన్‌రెడ్డికి చెందిన కాంప్లెక్స్ లో హుస్సేన్ అనే వ్యక్తి నాలుగు నెలలుగా క్రిసెంట్ కేఫ్ అండ్ బేకర్స్ నిర్వహిస్తున్నాడు. బేకరీతో పాటు బిర్యానీ విక్రయిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంటకు షాపు మూసి ఇంటికి వెళ్లారు. తెల్లవారు జాము 4.30 గంటల సమయంలో షాపులో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి పక్కన ఉన్న హరి దోస హోటల్ వైపుతోపాటు వెనకాల ఉన్న మెకానిక్ షాపు వైపు గోడలు ధ్వంసమైయ్యాయి. షాపు ముందు భాగం గోడలతో సహా ఊడిపోయి షెట్టర్ గాల్లోకి లేచి ప్రధాన రహదారి పుట్‌పాత్‌పై పడ్డాయి. గోడ ఇటుకలు హరి దోస హోటల్‌లోని వంట గదిలో స్టా పై కాగుతున్న కడాయిలో పడటంతో అక్కడే ఉన్న మాస్టర్లు వుండరిక్ (21) కిరణ్ షిండే(25)లపై నూనె పడి తీవ్ర గాయాల య్యాయి. హోటల్లో పనిచేసే మరో నలుగురు సిబ్బంది శివాజి, నాగప్ప, సోను, బబ్లు కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేటు దవాఖానాకు తరలించారు. పుండలిక్ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి నుంచి వివరాలు సేకరించారు. వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ వెంకటరమణ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నడిరోడ్డుపై ఆగిన ఆర్టీసీ బస్సు.. ట్రాఫిక్ జామ్

దుర్గానగర్ చౌరస్తాలో ఆగిపోయిన ఆర్టీసీ బస్సును పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీస్ అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 24: ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్న ఆర్టీసీ బస్సు దుర్గానగర్ చౌరస్తా నడిరోడ్డుపై ఆగిపోయింది. అసలే సాయంత్రం సమయం రోడ్డుపై బస్సు ఆగిపోవడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ఆగిపోయిన బస్సుకు మరమ్మతులు చేశారు. అయినా బస్సు కదలకపోవడంతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ భారీ క్రేన్‌ను రప్పించి బస్సును రోడ్డు మధ్య నుంచి పక్కకు జరిపించారు. ఆర్టీసీ బస్సు ఆగిపోవడంతో ఏర్పడిన ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. దాంతో వాహనదారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

హోమియో వైద్యంతో మెరుగైన ఫలితాలు

హిమాయత్‌నగర్, మార్చి 24: ఆదివాసీ ప్రాంతాల్లో హోమియో వైద్యులు పర్యటించి వారికి సేవలందిస్తే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని పాలమూరు యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ మనోజ తెలిపారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని జూపల్లి బాలమ్మ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుణాత్మకమైన, అత్యున్నత సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆరోగ్య సేవలందిస్తున్న పలువురు మహిళా హోమియో వైద్యులను సత్కరించారు. కార్యక్రమంలో హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ కె.గోపాలకృష్ణ, ప్రధానకార్యదర్శి డాక్టర్ దుర్గాప్రసాదావు, నేతలు డాక్టర్ వేణుగోపాల్‌గౌరి, డాక్టర్ హేమప్రభ తోపటు పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

రవాణా కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నారాయణగూడ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

హిమాయత్‌నగర్, మార్చి 24: రాష్ట్ర వ్యాప్తంగా రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సోమవారం నారాయణగూడలో చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచిన్నప్పటికీ రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అమలు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటోమీటర్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని లేనియెడల ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నరసింహారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోదా మల్లేశ్‌గౌడ్, కార్యనిర్వహక అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, క్యాబ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఆటో యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎస్. దయానంద్, నేతలు అంబ దాసు, నాగరాజు, నాగమల్లయ్య తదితరులున్నారు.

వృథాగా నీరు.. పట్టించుకోని అధికారులు

శంషాబాద్ రూరల్, మార్చి 24: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్‌భగీరథ పథకంద్వారా తెలంగాణలోని ప్రతి ఇంటికి తాగునీరందించింది. కానీ గత 15 నెలలుగా మిషన్ భగీరథ పైపులైన్లను పర్యవేక్షించే అధికారులు పట్టించుకోకపోవడంతో శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు సరఫరా అయ్యే నీరు వృథాగా పోతున్నది. మండలంలోని అలీకోల్ తడా రోడ్డులో సోమవా రం పైపులైన్ లీకై నీరు వృథాగా పోతుండటంతో సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించు కోవడంలేదు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా చేయాలి

హిమాయత్‌నగర్, మార్చి 24: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికార నివాసంలో భారీగా లభించిన నగదు ఘటనపై సమగ్రమైన విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యు డు వీఎస్ బోస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. న్యాయ వ్యవస్థలో సైతం అవినీతి లోతుగా పాతుకుపోయిందని, న్యాయవ్యవస్థను ప్రజలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నోట్ల కట్టల వ్యవహారం తనకు సంబంధంలేదని జస్టిస్ యశ్వంత్ వర్మ చేసిన ప్రకటన ఒక రాజకీయ నేత చేసిన ప్రకటనలా ఉందన్నారు. న్యాయ వ్యవస్థపై గౌరవం ఉంటే న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ తక్షణమే రాజీనామా చేసి విచారణ కమిటీకి సహకరించాలన్నారు.

'పునర్విభజన'ను వాయిదా వేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: దక్షిణ భారతదేశ రాజకీయ అస్థిత్వాన్ని దెబ్బతీస్తున్న పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనను 25 ఏళ్లు వాయిదా వేయాలని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. తక్షణమే హైదరాబాద్‌ను దేశ రెండవ రాజధానిగా ప్రకటించాలని కోరా రు. ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్, ఇతర విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ఆయన సోమవారం నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను దేశ రెండవ రాజధానిగా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు కల్పించిన వాక్ స్వాతంత్రాన్ని ఓయూలో కాపాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 29లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల రెండవ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

పరీక్ష జవాబు పత్